క్లుప్తంగా

నిడమనూరులో డేటా ఎంట్రీ పూర్తి

నిడమనూరు : ప్రజా పాలనలో స్వీకరించిన అభయహస్తం గ్యారంటీ దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి అయ్యిందని నిడమనూరు ఎంపీడీఓ ప్రమోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు 14668 దరఖాస్తులను స్వీకరించారు. వాటి డేటా ఎంట్రీ పూర్తి అయినట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు డేటా ఎంట్రీని పూర్తి చేశారని తెలిపారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులు

నాగార్జునసాగర్ : జాతీయ స్థాయి నెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో నాగార్జునసాగర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 10,11,12 తేదీల్లో మహబూబ్‌నగర్‌లోని ఇండోర్‌స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి 16వ సౌత్ జోన్ సీనియర్ నెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో తెలంగాణ పురుషుల జట్టు ప్రథమ బహుమతి సాధించింది. ఈ టీంలో నాగార్జునసాగర్ సీనియర్ నెట్‌బాల్ క్రీడాకారులు ఎస్.కె.నాగూర్‌భాష, కె.సంయుత్‌నాయుడు లు ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించారు. వీరిని ఉమ్మడి నల్లగొండ జిల్లా నెట్‌బాల్ సెక్రెటరీ కిరణ్‌కుమార్ అభినందించారు.

పోలీసులకు పట్టుపడ్డ దొంగలు

త్రిపురారం : మండలంలోని రాజేంద్రనగర్ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం రాత్రి త్రిపురారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండడంతో రాత్రి రెండు గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు గొర్రె పొట్టేలును బైక్‌పై తీసుకెళ్తుండడంతో అనుమానంతో విచారించారు. దీంతో వారు పొట్టేలును దొంగిలించి తీసుకెళ్తున్నట్లు గుర్తించి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. దీంతో దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న గొర్రె పొట్టేలు రాజేంద్రనగర్‌లో ఓ ఇంటిలో కట్టేసి ఉన్నట్లు గొర్రె పొట్టేలు ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. అయితే గత కొన్ని రోజులుగా మండల వ్యాప్తంగా గ్రామాలలో పలు దొంగతనాలు జరుగుతుండడంతో రాత్రి వేళలలో గొర్రెలు, బర్రెలు కూడా దొంగతనాలు జరుగుతున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. త్రిపురారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కలిసి ఇతర ప్రాంతంలోని గొర్రెను దొంగిలించి పోలీసులకు పట్టుబడినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మాడుగులపల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో ఆ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగు రంగవల్లులు తీర్చిదిద్దారు. పోటీల్లో మొదటి బహుమతి దర్శనం పూలమ్మ, రెండో బహుమతి మానస, మూడో బహుమతి ప్రనూష, నాలుగో బహుమతి వసంత గెలుచుకున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాక్, ఉపాధ్యక్షుడు పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి,అలుగుబెల్లి నర్సిరెడ్డి, లక్కీ ప్రసాద్ పాల్గొన్నారు.

మినిమం పే స్కేల్ అమలు చేయాలి

నల్లగొండ: సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ శనివారం నల్లగొండ పట్టణానికి విచ్చేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి ఆ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు తిరందాసు సంతోష్‌కుమార్, పగిడిపాటి ప్రవీణ్, యాదయ్య, హమీద్, శ్రీధర్, కొంపెల్లి రమేష్, శ్రీను, అజీమ్, సంధ్యారాణి, పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

నల్లగొండ రూరల్: మండలంలోని నర్సింగ్‌భట్ల గ్రామంలో శనివారం నర్సింగ్‌భట్ల విలేజ్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 50 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కమిటీ ప్రతినిధి తిరుమల నర్సింహ గ్రామంలో కోతుల సమస్యల పరిష్కారానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోటిలింగం, తాజుద్దీన్, జిల్లా శ్రీశైలం, సత్తయ్య, శంకరయ్య, బొమ్మగోని సత్యనారాయణ, తిరుమల రాము,శేఖర్, బిక్షం, లింగస్వామి, రమేష్, పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక పండుగలు

మిర్యాలగూడ : పండుగలు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఇస్లాంపుర 47వ వార్డులో సంక్రాంతి పండుగ సందర్భంగా కౌన్సిలర్ ఘని ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహిస్తారని, మూడు రోజులపాటు జరుపుకునే సంక్రాంతి వేడుకలను ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మొదటి విజేతకు 5తులాల వెండి, రెండో బహుమతి 4తులాల వెండి, మూడో బహుమతి పట్టు చీరను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు బాలు, నూకల వేణుగోపాల్‌రెడ్డి, జావిద్, ఆలగడప యాదగిరి, షేక్ అహ్మద్, పాషా, అఫ్రజ్, పర్వేజ్, అరుణ్, కలీం, ముజీబ్, హమీద్, ఫెరోజ్‌ఖాన్, రహీం, అశోక్, మోయిజ్ పాల్గొన్నారు.


మిర్యాలగూడ : మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


మిర్యాలగూడ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పట్టణంలోని మెయిన్‌బజార్‌లో గల శ్రీరామమందిరంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించి అయోధ్య రామమందిర ప్రతిమను బహూకరించారు. ఈ కార్యక్రమంలో తల్లం అశోక్, మల్లయ్య, త్రినాథ్, రామ్మూర్తి, లింగయ్య, భరత్, చంద్రశేఖర్, మురళిసింగ్, వెంకటేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన వాకర్స్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచే తాను అనేక సేవా కార్యక్రమాలను ప్రారంభించానని తెలిపారు. ఆ కళాశాల గ్రౌండ్ అభివృద్ధికి ఎలాంటి సహాయ, సహకారాలు కావాలన్న తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మాడుగులపల్లి : మండలంలోని తోపుచర్ల గ్రామానికి చెందిన గున్‌రెడ్డి శిరీష ఆర్థిక ఇబ్బందులు తాళలేక శుక్రవారం హైదరాబాద్‌లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. శనివారం స్వగ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ఆమె భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, సర్పంచ్‌లు మంగ యాదయ్య, చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్, నాయకులు బట్టు మాధవరెడ్డి, గనిపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.


మృతురాలి కూతురును ఓదారుస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వెంకటయ్య మృతి బాధాకరం

చింతపల్లి : మండల పరిధిలోని చాకలి శేరిపల్లిలో తాటిచెట్టుపై నుంచి జారిపడి మృతి చెందిన జనకుంట్ల వెంకటయ్య మృతి బాధాకరమని ఎమ్మెల్యే బాలునాయ్ అన్నారు. శనివారం ఆ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, వెంకటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ మల్లమ్మజంగయ్యగౌడ్, నాయకులు అంగిరేకుల నాగభూషణం, దొంతం సంజీవరెడ్డి, జటావత్ హరినాయక్, రసింహారెడ్డి, కేశవాణి వెంకటేశ్‌గౌడ్, బుచ్చయ్యగౌడ్, భాష, సత్యనారాయణ, రవినాయక్, సర్పంచ్ కేశగోని రవీదర్‌గౌడ్, మద్దెల కొండల్‌గౌడ్ తదితరులున్నారు.


వెంకటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

జొన్నలగడ్డ కమలాకర్‌రెడ్డికి నివాళి

మిర్యాలగూడ : బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ కమలాకర్‌రెడ్డి శుక్రవారం రాత్రి చిట్యాల వద్ద జరిగిన రైలు ప్రమాదంలో మృతిచెందారు. శనివారం ఆయన మృతదేహాన్ని పట్టణానికి తీసుకురాగా బీజేపీ కార్యకర్తలు, ఏబీవీపీ నాయకులు, అభిమానులు పట్టణంలోని వై జంక్షన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాపూజీనగర్ శ్మశానవాటికలో బీజేపీ నాయకులు కమలాకర్ రెడ్డి మృతదేహంపై పార్టీ జెండాను కప్పి దహన సంస్కారాలు చేశారు. కమలాకర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొండపాటి వెంకట్‌రెడ్డి, చిలుకూరి శ్యామ్, బంటు గిరి, రేపాల పురుషోత్తంరెడ్డి, నాయకులు అభి, భరత్, కరుణాకర్‌రెడ్డి, కిరణ్, లక్ష్మారెడ్డి, రాధాకృష్ణ, శ్రీధర్, సైదులుబాబు, రవి నాయక్, మట్టయ్య, సైదులు, రాజశేఖర్, శ్రీను పాల్గొన్నారు.


మిర్యాలగూడ : కమలాకర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఎరుకల కులస్తులకు పింఛన్ ఇవ్వాలి

నల్లగొండ రూరల్: 50 ఏళ్లు నిండిన ఎరుకల కులానికి చెందిన మహిళలకు ప్రభుత్వం పింఛన్ ఇవ్వాలని ఎరుకల సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు నడిగడ్డ శైలజ, జిల్లా అధ్యక్షుడు మానుపాటి భిక్షమయ్య అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఎరుకల సంఘం మహిళ జిల్లా అడ్‌హక్ నూతన కమిటీ ఎన్నిక అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎరుకల సామాజికవర్గానికి చెందిన మహిళలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని ప్రభుత్వం అరికట్టాలన్నారు. మహిళ జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా కోనేటి ఇందిర, కోకన్వీనర్లుగా మానపాటి జ్యోతి, సుల్తాన్ సుచరిత, వల్లభాయ్ మంగమ్మ, ఎన్నుకున్నారు.

న్యాయపరమైన అంశాలపై అవగాహన

నల్లగొండ క్రైం : భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో న్యాయపరమైన అంశాలపై శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సీనియర్ లా ఫ్యాకల్టీ, న్యాయవాది ఎ. రాములు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టపరమైన అంశాలు, దస్తావేజులు, అగ్రిమెంట్లు, రెవెన్యూ చట్టాలు, పోలీస్ స్టేషన్ పరిధిలో సివిల్ కేసుల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సమావేశంలో ఎస్‌బీ డీఎస్పీ సోమ్‌నారాయణ్‌సింగ్, డీఎస్పీలు శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

కొండమల్లేపల్లి : క్రీడాకారులు తమలోని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి అన్నారు. శనివారం కొండమల్లేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా డివిజన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నాయకులు రమావత్ లాలునాయక్, కొర్ర రాంసింగ్‌నాయక్‌లతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మల్లేశ్‌యాదవ్, సురేష్, సురేష్, మంగ్యానాయక్, నాగరాజునాయక్, ఎండీ ఖదీర్, పాల్గొన్నారు.

బిల్డింగ్ తాపీ సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక


యూనియన్ సభ్యులను అభినందిస్తున్న పలువురు కార్మిక సంఘం నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : శ్రీ భవాని బిల్డింగ్ తాపీ సెంట్రింగ్ అండ్ వడ్డెర వర్కర్స్ యూనియన్ ఎన్నికలు పట్టణంలోని రెడ్డీకాలనీలో గల యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా జూకంటి సత్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఐటీయూ నాయకులు ఎస్.సోమయ్య, కోడిరెక్క మల్లయ్య, మాజీ అధ్యక్షుడు లక్ష్మయ్య, సీతయ్య, బొల్లెం అయోధ్య శేఖర్ లు ఎన్నిక నిర్వహించగా ఎన్నికలో సత్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు బాస్కర్‌రావు, రంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడలు ఐక్యమత్యాన్ని పెంచుతాయి


పోటీలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గుర్రంపోడు : పండుగల సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించడం మంచి సాంప్రదాయని, గ్రామీణ ప్రాంత క్రీడలు యువతలో ఐకమత్యాన్ని పెంచుతాయని జిల్లా కాంగ్రెస్ నాయకుడు వెల్గపూరి కరుణాకర్ రావు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని నడికూడ గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కల్యాణ్, గ్రామ సర్పంచ్ ఎండీ సత్తార్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన గౌడ సంఘం నాయకులు


గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

చింతపల్లి : మండలంలోని కల్లుగీత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. అనంతరం గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బాలగోని బాలరాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, ఎలుకటి విజయ్‌కుమార్‌గౌడ్, అనంతుల పెద్ద మల్లేశ్, పందుల యాదయ్య, గండు శ్రీను, మల్లేశ్, కుమార్‌గౌడ్, ముద్ద కృష్ణయ్యగౌడ్, జెల్ల నరసింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్మికుల నిరసన

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకంతో తాము రోడ్డున పడ్డామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఆటో యూనియన్ కార్మికులు శనివారం రక్తదానం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రోజుకు వేయి నుంచి రూ.1500 వరకు ఆదాయం వచ్చేదని ఉచిత బస్సు ప్రయాణ పథకంతో రోజుకు కనీసం రూ.3వందలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా తాము నిరసన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లకు ప్రతినెలా రూ.15వేల జీవన భృతి అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాజిద్, కార్యదర్శి పర్వీజ్, మహిమూద్, రమేష్‌బాబు, బాష, అంజద్, నజీర్, హమీద్, అజీమ్, నాగార్జున, వెంకటాద్రి, నరేష్ పాల్గొన్నారు.


మిర్యాలగూడ అర్బన్ : రక్తదానం చేస్తూ నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ కార్మికులు

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా యాదయ్య

మాడుగులపల్లి : కాంగ్రెస్ పార్టీ మాడుగులపల్లి మండల ఉపాధ్యక్షుడిగా గోపాలపురం గ్రామానికి చెందిన బోడ యాదయ్య నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు శంకర్‌నాయక్ శనివారం నాగార్జున సాగర్‌లో మాజీ సీఎల్పీ నేత జానారెడ్డితో కలిసి అతడికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన మంత్రి కోమటి రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి యాదయ్య కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.


యాదయ్యకు నియామకపత్రం అందజేస్తున్న జానారెడ్డి, శంకర్‌నాయక్

అండర్ గ్రౌండ్ సంపు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

మాడుగులపల్లి : మండలంలోని గోపాలపురం పంచాయతీ ఆవాసం దేవునిగోపాలపురం, వెంకటేశ్‌నగర్‌లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని వెంటనే అండర్‌గ్రౌండ్ సంపు నిర్మించి తాగునీరు సరఫరా చేయాలని కోరుతూ సర్పంచ్ మణెమ్మ నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 20 వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్నా ఎత్తు కారణంగా అందులోకి నీరు రావడం లేదని తెలిపారు.10 వేల లీటర్ల సామర్థ్యంతో అండర్ గ్రౌండ్ నీటి సంపు నిర్మిస్తే ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు.

‘న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు’

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని గుర్రపుతండాకు చెందిన కేతావత్ అచ్చి తన మరిది శక్రు భూ విషయంలో భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్లితే.. అచ్చికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. గతంలో అచ్చి భర్త లక్ష్మన్ చనిపోయాడు. వంశపారపర్యంగా 18 ఎకరాల 17గుంటలు భూమి రావడంతో అది లచ్చిపేరిట నమోదైంది. అచ్చి తన ఇద్దరు కుమార్తెలకు పెళ్లి కట్నం కింద ఒకరికి ఆరు ఎకరాలు, మరొకరికి ఐదు ఎకరాలు భూమి వారి పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చింది. మరో కుమార్తెకు పెళ్లి కావాల్సి ఉండా ఆమె పేరిట కూడా కొంత భూమిని పట్టా చేసింది. పదేళ్ల తరువాత తన భర్త తమ్ముడు(మరిది) శక్రు తరచూ ఆమె కూతుర్లను బెదిరిస్తూ భూమి మీదకి వచ్చి సేద్యం చేసుకునే సమయంలో వాళ్లను భయభ్రాంతులకు గురిచేసి వాళ్లపై దాడి చేస్తున్నాడని, దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సదరు వ్యక్తి గతంలోనే కేసు నమోదై జైలు శిక్ష కూడా అనుభవించాడు. అయినా సదరు వ్యక్తి తీరు మార్చుకోక గురువారం ఆమె కుమార్తె పొలం వద్దకు వెళ్లగా వారిపై దాడి చేసి గాయపర్చాడు. దీంతో వాళ్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళలు కావడంతో తమపై దౌర్జన్యం చేస్తున్నాడని, భూమికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయని, వంశపారపర్యంగా వచ్చిన అతను సాగు చేయకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, పోలీసులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాలుగా శైలజ


త్రిపురారం : శైలజకు అవార్డు అందజేస్తున్న రాజ్య సభ సభ్యుడు కృష్ణయ్య

త్రిపురారం : మండలంలోని కంపాసాగర్ టీఎస్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న రాపోలు శైలజకు ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాలి అవార్డు వరించింది. ఈ అవార్డు సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా రవీంద్రభారతీలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ మహిళా ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ఈ అవార్డును రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అందజేశారు. శనివారం ఉపాధ్యాయురాలు రాపోలు శైలజ మాట్లాడుతూ బాధ్యతతో కూడిన ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూరుగు నిర్మల, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ఆర్టీసి బస్టాండు సమీపంలోని పాలకేంద్రం కాంప్లెక్స్ ఎదుట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంత కావడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ఎలాంటి రక్షణ వలయాలు లేవు. రక్షణ వలయం ఏర్పాటు చేయాలని పలుమార్లు స్థానికులు విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైన విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


రక్షణ లేకుండా ప్రమాదకరంగా ఉన్నవిద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం

రామగిరి(నల్లగొండ) : తెలంగాణలోని ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ టీఎస్ ధ్యేయమని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని లెక్చరర్స్ భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత 12 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి 70శాతం సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర శాఖ పని చేస్తుందన్నారు. తెలంగాణ వచ్చి 10 సంవత్సరాలు గడుస్తున్నా ఉపాధ్యాయ సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదన్నారు. సమావేశంలో నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుముల బాల్‌రెడ్డి, కొండదల శంకర్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంచిరెడ్డి అనంత్‌రెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్. చంద్రశేఖర్‌రావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు. వివిధ సంఘాల నుంచి పీఆర్‌టీయూలో సీహెచ్. కళింగ చారి, మణిరాజు, నాగయ్య, అన్వర్ చేరారు.


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- ఖాళీ స్థలాల్లో మురుగు, చెత్తాచెదారం నిల్వ
- దోమలు, పందులు స్వైర విహారం
- అనారోగ్యం పాలవుతున్న పట్టణవాసులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మిర్యాలగూడ : అసలే చలికాలం... దోమలతో సతమతమవుతున్నారు. ఈ కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. దాన్ని అరికట్టాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో మిర్యాలగూడ మున్సిపాలిటీలో మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. ఈ మురుగు కూపంలో దోమలు, ఈగలు, పందులు, కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. మురుగు కుంటల్లో దోమలు, ఈగలు వ్యాప్తి చెందడం వల్ల అవి రాత్రి వేళల్లో ఇళ్లలో చేరి చిన్నపిల్లలు, వృద్ధులను ఇబ్బంది లు పెడుతున్నాయి. దీనివల్ల చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారు. సీజనల్ వ్యాధుల తోపాటు టైఫాయిడ్, డెంగీ, మలేరియా వంటి వ్యాధాలు సోకుతున్నాయి. ప్రధానంగా పారిశుద్ధ్య లోపంతో సీజనల్ వ్యాదులు ప్రబలి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సీజనల్ వ్యాదులు తగ్గకపోవడంతో రోజుల తరబడి ఆస్పత్రులు చుట్టూ తిరుగుతూ వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి చలికాలం సీజన్‌లో దోమల బెడద తీవ్రంగా ఉండడం వల్ల ప్రతిరోజు అన్ని వార్డుల్లో మున్సిపల్ అధికారులు దోమలను నివారించేందుకు ఫాగింగ్ చేయాలి. కాని మున్సిపల్ అధికారులు నెలకొకసారి కూడ ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు, ఈగలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. ప్రధానంగా పట్టణంతోపాటు, శివారు కాలనీలు, స్లమ్ ఏరియాలు అయిన తాళ్లగడ్డ, బంగారుగడ్డ, సీతారాంపురం, ముత్తిరెడ్డికుంట, సుందర్‌నగర్, వినోబానగర్, గాంధీనగర్, షాబునగర్, బాపూజీనగర్, ప్రకాశ్‌నగర్, విద్యానగర్, సబ్‌జైలు ప్రాంతాల్లో మురుగు నీరు దర్శనమిస్తున్నాయి. సబ్ జైల్ ఏరియాలో ఇళ్ల మధ్యనే చెత్తాచెదారంతోపాటు మురుగు నీరు ఉండడంతో శుభ్రం చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులు విన్నవించకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వారానికి ఒక్కసారైనా కూడా దోమలను నివారించేందుకు ఫాగింగ్ చేయడం లేదని విమర్శిస్తున్నారు. విపరీతంగా దోమలు వ్యాప్తి చెంది పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాల్వలను శుభ్రం చేసి చెత్తా చెదారం లేకుండా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


సుందర్‌నగర్‌లో ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగునీరు


సబ్ జైలు వద్ద మురుగుకాల్వ వెంట చెత్త


షాబునగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న వ్యర్థాలు

ప్రతి రోజూ శుభ్రం చేయిస్తాం

పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు వెంటనే చర్యలు చేపడ్తాం. మురుగు కాల్వలను ప్రతిరోజూ శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. ఖాళీ ప్లాట్లలో మురుగు నీరు, చెత్తాచెదారం ఉండకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్న ప్రాంతాల్లో ప్రతిరోజు వాటి నివారణకు ఫాగింగ్ చేస్తాం.

– పూర్ణచందర్‌రావు, మున్సిపల్ కమిషనర్